నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, ఆదివారం 1 డిసెంబర్ 2024 | KAMAREDDY

## తహసీల్ కార్యాలయాల ముట్టడి

- రూ.12 వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మికుల డిమాండ్
- కాంగ్రెస్ మోసం చేసిందని మండిపాటు

బోధన్ రూరల్/ ధర్పల్లి/ ఆర్మూర్ టౌన్, నవంబర్ 30: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.12 వేల జీవనభృతి అందించాలని డిమాండ్ చేస్తూ పలు మండలాల్లో వ్యవసాయ కార్మికులు శనివారం ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ధర్పల్లి, బోధన్ తహసీల్ కార్యాలయాలను ముట్టడించారు. అంతకు ముందు ఆయా మండలాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎంఎస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా వ్యవసాయ కార్మికులు ఉన్నారని, ఏడాది పొడవునా పని దొరకడం లేదన్నారు. పని దొరికినా ఆదాయం అంతంత మాత్రమే అని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేశ్, రాజేశ్వర్, దామోదర్, లింబన్న, కిశోర్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు. డిమాండ్ల సాధనకు సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాకు వ్యవసాయ కార్మికులు భారీగా తరలిరావాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవారాం పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దొంగ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీల అమలులో విఫలమైందని మండిపడ్డారు.



ధర్పల్లిలో తహసీల్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న వ్యవసాయ కూలీలు, ఏఐపీకేఎంఎస్ నాయకులు



### రూ. 8 కోట్లతో ఏడాది క్రితం క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు.. ప్రారంభం కాని సేవలు

గత ప్రభుత్వం జీజీహెచ్‌లో గుండెజబ్బుల వైద్యసేవలను అందించేందుకు సుమారు రూ. 8 కోట్లతో అత్యాధునిక క్యాథ్‌లాబ్ మిషన్ అందజేసింది. దీని ఏర్పాటుకు జీజీహెచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గోడలను కూల్చి యంత్రం ఏర్పాటు చేయడంతోపాటు కంప్యూటర్ పరీక్షలు చేసేందుకు ప్రత్యేక గది, గుండె ఆపరేషన్ అనంతరం రోగిని పరిశీలనలో ఉంచేందుకు కొన్ని పడకలతో కూడిన ప్రత్యేక గదిని నిర్మించారు. ఇన్ని ఏర్పాట్లు చేసినా క్యాథ్‌లాబ్‌కు సంబంధించిన వైద్యులు, టెక్నీషియన్లు లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడం, అడిగే అధికారులు లేకపోవడంతో వైద్యసేవలు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.



గుండెజబ్బు రోగుల కోసం కేటాయించిన గది




జీజీహెచ్‌లో క్యాథ్‌ల్యాబ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదికి వేసి ఉన్న తాళం

- జీజీహెచ్‌లో రూ. 8 కోట్లతో క్యాథ్‌ల్యాబ్ యంత్రం, సామగ్రి ఏర్పాటు
- ఏడాది క్రితం అందుబాటులోకి వచ్చినా ప్రారంభానికి నోచుకోని సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గుండె వ్యాధిగ్రస్తులు
- వేధిస్తున్న వైద్యులు, టెక్నీషియన్ల కొరత
- ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్న బాధితులు

### కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మెరుగైన సేవలు, అరుదైన శస్త్రచికిత్సలు

బీఆర్ఎస్ హయాంలో జీజీహెచ్‌కు కావాల్సిన యంత్రాలు, వసతులను కల్పించడంతో వైద్యులు ఉచితంగా అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఎంతో మందికి మోకాలి చిప్ప మార్పిడితోపాటు అరుదైన శస్త్ర చికిత్సలు చేసి శభాష్ అనిపించుకున్నారు. కానీ కొన్ని నెలల క్రితం దవాఖానకు సంబంధించిన 22 మంది సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. ఇద్దరు వైద్యులు మాత్రమే భర్తీ అయ్యారు. రోగులకు సరిపడా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం వైద్యసేవలు అందడం లేదు. మందుల కొరత కూడా వేధిస్తున్నది. ఇటీవల రోటరీ క్లబ్ ప్రతినిధులు జీజీహెచ్‌కు రూ. 28.30 లక్షల విలువచేసే రేడియాలజీ యంత్రాన్ని అందజేశారు. అయినా వైద్యసేవలు అంతంత మాత్రమే. అత్యాధునిక యంత్రాలు దవాఖానలో అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యులు, సిబ్బంది లేకపోతే పేదలకు ఎలా వైద్యసేవలు అందుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# క్యాథ్‌ల్యాబ్

ఖలీల్‌వాడి, నవంబర్ 30 : గుండెజబ్బు... ప్రస్తుతం ఈ పదం వింటేనే అందరూ గడగడలాడుతున్నారు. ఇటీవల కాలంలో గుండెజబ్బులు తీవ్రమయ్యాయి. వయసుతో సంబంధం లేకుండా చాలా మంది గుండెపోటుకు గురవుతున్నారు. గతంలో సుమారు 40 ఏండ్లు దాటిన వారికి మాత్రమే గుండె సంబంధిత వ్యాధులు వచ్చేవి. ఇటీవల వయస్సుతో సంబంధం లేకుండా యువత, చిన్నారులు కూడా గుండెపోటుకు గురవుతున్నారు. గుండెజబ్బుల బారిన పడిన పేదలకు సకాలంలో వైద్య సేవలు అందాలని, ఇబ్బందులు ఎదుర్కోవద్దనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానకు ఖరీదైన, అత్యాధునిక టెక్నాలజీతో కూడిన క్యాథ్‌ల్యాబ్ యంత్రాన్ని అందజేశారు. గుండెజబ్బు వచ్చిన వ్యక్తి పరిస్థితిని అంచనా వేసేందుకు, తీవ్రతను బట్టి సరైన వైద్యసేవలు అందించేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుంది. ఈ యంత్రాన్ని ఏర్పాటు చేయించడంతోపాటు కావాల్సిన గదులు, సామగ్రి అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికలు రావడంతో వైద్యసేవలు అందుబాటులోకి రాలేదు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా వైద్యసేవలు మాత్రం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో జీజీహెచ్‌లోని వైద్యులు క్యాథ్‌లాబ్ గదికి తాళం వేశారు.




క్యాథ్‌ల్యాబ్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పవర్ రూం

### డాక్టర్ వస్తే ల్యాబ్ సేవలను అందుబాటులోకి తెస్తాం..


క్యాథ్‌ల్యాబ్ సేవలు అందిచడానికి ప్రభుత్వ దవాఖానలో అన్ని వసతులు ఏర్పాటు చేశాం. కార్డియాట్రిక్ డాక్టర్ లేకపోవడంతో దానిని మూసివేశాం. నోటిఫికేషన్ జారీ చేసినా డాక్టర్లు రాలేదు. లోకల్ వైద్యులు కూడా రావడంలేదు. ఈ విషయాన్ని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషనల్ డాక్టర్ వాణి దృష్టికి తీసుకెళ్లాం.ఇప్పటివరకు డాక్టర్ లేకపోవడంతో క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించలేదు. డాక్టర్‌ని నియమిస్తే వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.



**- డాక్టర్ ప్రతిమారాజ్,**
**జిల్లా ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్**

## ఇదేం ప్రభుత్వం.. ఇదేం పద్ధతి?

- అధికారిక కార్యక్రమంలో అనధికార వ్యక్తులా?
- కలెక్టర్‌పై సీఎస్‌కు మాజీ మంత్రి వేముల ఫిర్యాదు
- రాజ్యాంగ ఉల్లంఘనలపై ప్రశాంత్‌రెడ్డి అసంతృప్తి
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విన్నపం



VEMULA PRASHANTH REDDY
M.L.A.

Plot. No. 63, Sri Sai Nagar, Road No.13, Banjara Hills, Hyderabad-500034

H.No. 5-11, Vill & Mdl. Velpur, Dist: Nizamabad-503311

తేదీ - 30/11/2024,

వేముల ప్రశాంత్ రెడ్డి

ప్రభుత్వ సీఎస్‌కు మాజీ మంత్రి వేముల రాసిన లేఖ

నిజామాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్య విలువలు మంటగలుస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలే కాదు.. ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులు సైతం నిబంధనలను బుట్టదాఖలు చేస్తున్నారు. చెడు సంస్కృతికి బాటలు వేస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు కలెక్టర్లు, అధికారులంతా బహిరంగంగానే ఊడిగం చేస్తుండడం జనాల్ని ముక్కున వేలేసుకునేలా చేస్తున్నది. నిబంధనలు, ప్రొటోకాల్ మర్యాదలు పాటించాల్సిన వ్యక్తులే అధికార పార్టీ నేతలకు ఎర్ర తివాచీ పరిచి రాచమర్యాదలు చేస్తుండడంపై విమర్శలకు తావిస్తున్నది. రెండ్రోజుల క్రితం నవంబర్ 29న కలెక్టరేట్‌లో ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి, రోడ్లు భవనాల శాఖపై సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో మంత్రితో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. వీరికి తోడుగా వేదికపై కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం ఆసీనులు కావడం చూసి అక్కడున్న వారు అవాక్కయ్యారు. ప్రజలతో తిరస్కరించబడిన వ్యక్తులు దర్జాగా తమకేం తక్కువ అన్నట్లుగా రెచ్చిపోయి వేదికను అలంకరించారు. సాక్షాత్తూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఎదుటే ఈ తంతు జరగడం విశేషం. అనధికార వ్యక్తులను దూరం పెట్టాల్సి ఉండగా, తన పక్కనే కూర్చోబెట్టుకుని నిబంధనలను ఉల్లంఘించారు. ఈ విషయంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యంత్రాంగం తీరును ప్రజలంతా తప్పు పడుతున్నారు. ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తున్నారు.

### సీఎస్‌కు వేముల ఫిర్యాదు..

మంత్రి కోమటిరెడ్డి నేతృత్వంలో జరిగిన సమీక్షా సమావేశానికి బాల్కొండ, ఆర్మూర్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన ముత్యాల సునీల్‌రెడ్డి, పొద్దుటూరి వినయ్‌రెడ్డిలను ఆహ్వానించడాన్ని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రంగా తప్పు పట్టారు. కలెక్టరేట్‌లో ప్రజాస్వామ్య విలువలకు పాతరేశారంటూ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన కలెక్టర్ ఎదుటే ఉల్లంఘనలు జరిగాయంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఎంత మాత్రమూ సహించడానికి వీలు లేదన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సమావేశాన్ని నిర్వహించిన కలెక్టర్, సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వేముల సీఎస్‌ను కోరారు. భవిష్యత్తులో ఇలాంటి అనధికారిక వ్యక్తులను అధికారిక కార్యక్రమాల్లో ప్రోత్సహించకుండా జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు. ఈ ఫిర్యాదుపై సీఎస్ ఎలా వ్యవహరిస్తారో చూడాలి.

## ఇన్‌చార్జి కమాండెంట్‌గా సత్యనారాయణ

డిచ్‌పల్లి, నవంబర్ 30 : డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్‌గా అడిషనల్ కమాండెంట్ పి. సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బెటాలియన్ కమాండెంట్‌గా పని చేసిన ఐపీఎస్ అధికారి రోహిణి ప్రియదర్శిని గత నెల 20న కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆమె స్థానంలో మూడో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేశ్‌కు ఏడో బెటాలియన్ బాధ్యతలు అప్పగించారు. ఆయనను ప్రస్తుతం వరంగల్ మామునూర్‌లోని 4వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. ఏడో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా ఉన్న పి.సత్యనారాయణను ఇన్‌చార్జి కమాండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు.



సత్యనారాయణ

## పింఛన్ పెంచాలని దివ్యాంగుల ధర్నా





బోధన్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న దివ్యాంగులు

బోధన్ రూరల్ / కామారెడ్డి, నవంబర్ 30 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్‌చేస్తూ బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు శనివారం ధర్నాకు దిగారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దివ్యాంగుల పెన్షన్లను రూ.6 వేలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా పింఛన్లను మాత్రం పెంచకుండా మోసం చేసిందని మండిపడ్డారు. పింఛన్లను వెంటనే పెంచాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు యేశాల గంగాధర్, రామ్‌పటేల్, షేక్ నజీర్, సాయమ్మ, గోపాల్ గౌడ్, రాకేశ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాకేంద్రంలో విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పెన్షన్ పెంచాలని, ఉచిత రవాణా సౌకర్యం, బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీ, ఉన్నత విద్య, ఉద్యోగాల రిజర్వేషన్లు, ఉపాధి అవకాశాలు కల్పించాలని సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్ కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాడి నర్సింహులు, సబ్ కమిటీ చైర్మన్ ఈశ్వర్, వైస్ చైర్మన్ నితీశ్ రెడ్డి, సభ్యులు బంటు స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దివ్యాంగులు

## మోసం చేసిన కాంగ్రెస్



కోటగిరి మండలంలోని కేజీబీవీ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు



కామారెడ్డి జిల్లాకేంద్రంలో...

- ఏడాది కావొస్తున్నా క్రమబద్ధీకరించలే..
- ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి
- సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు

నమస్తే యంత్రాంగం, నవంబర్ 30 : సమగ్ర శిక్షఅభియాన్ ఉద్యోగులను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఆందోళనలు చేపట్టారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట, నిజాంసాగర్, నస్రుల్లాబాద్, కోటగిరి, మద్నూర్, బిచ్కుంద తదితర మండలాల్లో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇస్తున్నట్లే పేస్కేల్ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చారని, గద్దెనెక్కి ఏడాది కావొస్తున్నా ఇప్పటివరకూ హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. విద్యావ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ హామీని రేవంత్ సర్కారు నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, లేకపోతే ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. హిమాచల్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో సర్వశిక్ష అభియాన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న వారిని అక్కడి ప్రభుత్వాలు రెగ్యులర్ చేసి, పేస్కేల్ అందిస్తున్నట్లు తెలిపారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల శ్రమదోపిడీని అరికట్టాలని, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, రీ ఎంగేజ్ లేకుండా చూడాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 3వ తేదీలోగా ఉద్యోగుల క్రమబద్ధీకరణ, పే స్కేల్‌పై నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.